
# పండుగ



## నేత పనితనాన్ని కళ్ళకు కట్టే కథ


### అల్లంసెట్టి చంద్రశేఖరరావు

తెల్లవారితే భోగి. ఇంకా గజం నేత వుంది. భోగి మంటేసిన తరవాత పని చెయ్యరు. పండక్కి పనులు ఆపేస్తారు. మళ్లీ పది, పదిహేను రోజుల వరకూ పనులు ముట్టరు. భావనా ఋషి పండుగు చేసిన తరవాత మంచిరోజు చూసుకొని కొత్తపనులు ముడతారు. కొత్త సంవత్సరానికి పనివాళ్లను చూసుకోవాలి. మళ్లీ ఈ పనివాళ్లే వస్తారో లేదో తెలీదు. జీతాలు పెంచమంటారు. ఒకరిద్దరు వీళ్లని పనిలోకి రమ్మంటున్నట్లు భోగట్టా. తన దగ్గర బాగా పని నేర్చుకొన్నారు. వీళ్లను వదలకూడదు.

చిన్నపనోడు అప్పారావుకి నేత రాదు. కాని వాటుకు కూర్చున్నాడంటే నేతగాడు పరిగెట్టాల్సిందే. అంత జోరుగా పనిచేస్తాడు. సాలునాడి పడుగులో గుచ్చాడంటే రెండంటే రెండు, నాలుగంటే నాలుగు లెక్కపెట్టినట్లు మొనమీద పడుగు పోగులుండాల్సిందే (సాలువాడి: అంచురంగు దారం కలిగివున్న చిన్న నాడి. అంచులో మాత్రమే ఈ నాడి తిరుగుతుంది. మిగిలిన పడుగు భాగంలో పెద్దనాడి తిరుగుతుంది. దీనిలో తెల్లదారం వుంటుంది. లేదా రంగు చీరైతే రంగుదారం వుంటుంది). మొగ్గ తీశాడంటే అచ్చుగుద్దినట్లుంటుంది. జులాయిగా తిరుగుతాడు గాని బాధ్యత తెలిసినవాడు. వాడు తనదగ్గర తప్పించి మరెక్కడా పనిచెయ్యలేదు. పెద్ద పనోడు మల్లిబాబు చదువుకొన్నవాడు. పనితెలిసినవాడు. డబ్బు మీద ఆపేక్ష ఎక్కువ. కూలికి తగినంత పనిమాత్రమే చేస్తాడు.

నేతకు వాడిన నూలుపోగా మిగిలిన నూలు నెలాఖరులోగా సొసైటీకి జమకట్టాలి. రేపు నేత దిగిపోతే వాడకం పోగా పనివాళ్లకివ్వవలసిన డబ్బులేమైనా వుంటే ఇచ్చేసి లెక్కలు తేల్చేయాలి. కొత్త సంవత్సరానికి పనివాళ్లకి బయానా ఇవ్వాలి. పనులు ముట్టిన తరువాత నూలు తెచ్చుకోవాలి. తడపాలి, తోడాలి, పడుగు ఇసురుకోవాలి. తరువాత పడుగేరాలి, సరి చెయ్యాలి, అతుక్కోవాలి, అల్లు పట్టాలి. ఈ పనులన్నీ చేసేందుకు సరైన మనుషులు దొరకాలి. ఇవన్నీ అయేసరికి పది, పదిహేనురోజులు పడుతుంది. ఫిబ్రవరి మొదటి వారానికి గాని పడుగు మగ్గం మీదకెక్కదు. నేత ప్రారంభం అయిన తరువాత వారం పదిరోజులకుగాని చీర దిగదు. అంటే సుమారు నెలరోజులవరకు చేతికి డబ్బు అందదు. పనివాళ్లకు జీతాలు, టైలరుకి కుట్టుకూలి, చాకలికి పండుగు జీతం, మంగలికి పండుగు మామూలు, బాకీలు, పండుగు ఖర్చులు, ఇంటి ఖర్చులు, కొడుకు స్కూలు ఫీజు..తెల్లవారేసరికి నేత దిగిపోవాలి. ఎలాగైనా రేపు మూర్తులు సొసైటీకి జమకట్టి మంజూరు తీసుకోవాలి. భోగి నుండి వారంరోజులు సొసైటీకి సెలవు. ఎవరైనా మూర్తులు తెస్తే జమకట్టుకొని, లెక్కచూసి వాళ్లకి మజూరు ఇవ్వడం కోసం భోగినాటి ఉదయం మాత్రం పనిచేస్తారు.

తెల్లవార్లూ నేస్తే కోడి కూసేవేళకి నేత దిగిపోతుంది. రేపు ఉదయం సొసైటీకి తీసుకెళ్లాలి. రెండు మూర్తులు వున్నాయి. మంచి చీరలు. జరీ అంచువి. చక్కని డిజైను వుంది. మైజారు గూడ చక్కగా అమరింది. మజూరు ఎక్కువ వస్తుంది కదా అని ఈ ఆర్డరు తనే తీసుకొన్నాడు. ఇతర నేతగాళ్ల పోటీ కూడా లేదు. ఇలాంటి అంచులు వాళ్లు నేయలేరు. వజా జమ్‌దానీ పనివాళ్లకు సరిగా రాదు. మైజారులో మంచి బుటాదరీ పని



చూపించడం చేత పని జోరుగా నడవడం లేదు. సాదా నేస్తే రెండు చాపులు దిగుతాయి. ఈ డిజైను రావడానికి మూడురోజులు కష్టపడవలసి వచ్చింది. ఈ మూడు రోజుల్లో నేసింది గజం కూడా లేదు. అనుకొన్నట్లుగానే మంచి అంచు తయారైంది. పని వేగంగా జరుగుతూనే వుంది. ఈరోజు మధ్యాహ్నానికి అయిపోవలసిందే కాని పెద్ద పనివాడు మల్లిబాబుకి విరోచనాలు పట్టుకోవడం వల్ల ముందురోజు పని జరగలేదు. తను మొగ్గంలో కూర్చొని నెయ్యవలసి వచ్చింది. తనతో కలిసి ముగ్గురు నేసేవాళ్లు. ఒకడు తగ్గిపోవడంతో భోజన సమయంలో పని ఆపేయవలసి వచ్చింది. మామూలుగా అయితే ఇద్దరు పనివాళ్లలో ఒకడు భోజనానికి వెళ్తే ఆ స్థానంలో తను కూర్చుండేవాడు. నేతగాడు వెళ్తే తాను నేత నేసేవాడు. వాటుగాడు వెళ్తే తాను కుడిచేతివైపు వాడిచోటులో కూర్చొని వాటు వేసేవాడు. ఇలాగ ఇడికిళ్లు చెయ్యడం వల్ల ఆగకుండా పని నడుస్తూనే వుంది. రెండురోజుల నుండీ రాత్రి ఒక గంట ఎక్కువగానే పని చేస్తున్నారు. అలాగే ఉదయం ఒక గంట ముందు వస్తున్నారు. ఉదయం ఐదుగంటల నుండి రాత్రి పదకొండు వరకు పనిచేస్తున్నా గూడా ఈ వేళకీ నేత దిగలేదు.

శీతాకాలం పొద్దు. వేగంగా చీకటి పడిపోతుంది. అప్పుడే బుడ్డిదీపాలు ముట్టించేశారు. బుడ్డీనిండా కిరసనాయిలు పోస్తే పది, పదకొండు వరకూ సరిపోతుంది. తెల్లవారేసరికి ఒకటి రెండుసార్లు నింపుకోవాలి. కిరసనాయిలు తెప్పించి ఉంచుకొన్నారు. రాత్రి టీ కోసం పాలమనిషి దగ్గర అణా పాలు తీసుకొని వుంచింది ఇల్లాలు. అణా పంచదార, అర్ధణా బ్రూక్‌బాండ్ టీ పొట్లం తెచ్చాడు అప్పారావు. తెల్లవార్లూ పని జరగాలంటే ఈ ఇద్దరి వల్ల అవదు. రాత్రికి మూడో మనిషిని చూశాడు. ఈరోజు లింగరాజుగారి నేత దిగిపోతుంది. వాళ్ల పనివాడు సూరిబాబు రాత్రికి వస్తానన్నాడు. పెద్ద పనివాడు మల్లిబాబు పదకొండు తరువాత మరి పనిచెయ్యలేదు. అప్పారావు వాటేస్తూ పాట పాడుతున్నాడు.

'ఈ నాటి ఈ హాయీ.. కల కాదోయి నిజమోయీ.. ఏ నాటి వరమో.. ఏ నోము ఫలమో.. తొలిప్రేమ జవరాలా'

జయసింహా ఊరులో ఆడుతుంది. మొదటిరోజే రెండో ఆట చూసేసుంటాడు. "బాబూ భోజనానికి లెగను. ఆకలి లేదు. ఏకంగా తొమ్మిదిన్నరకి లెగిసిపోతాను" అన్నప్పుడే తనకి అనుమానం వచ్చింది వీడు సినిమాకి చెక్కేస్తాడని.

"సినిమా ఇంకా రెండురోజులు ఆడుతుందంటారా?" తనకీ చూడాలని వుంది. కానీ పని వొత్తిడి వల్ల కుదరలేదు.

"గొప్పజనం బాబూ. టిక్కట్ల కోసం తోసుకుంటున్నారు. బ్లాకులో మీరు కొనలేరు. నాలుగురోజులాగండి. కనుము దాటిపోనీయండి"

"ఒరే అబ్బీ సూరిబాబు వస్తాడంటావా?"

"వస్తాడు బాబు. ఆడికి ఇక్కడికొచ్చీయాలనుంది. రేపు లెక్కలు సూసి, డబ్బు చేతిలో పడినంత వరకూ ఆగుతాడు. లింగరాజుగారి నేత దిగిపోయింది. ఐనా అతనికి తెలీకుండా రావాలి. ఆడు తిండి తిని పడుకోని రాత్రి పన్నిండు గంటలకు వస్తాడు. కూలి మాత్రం పది రూపాయిలు అడుగుతున్నాడు. ఆడికి ఆశెక్కువ"



"అలాగే ఇస్తారన్నావు కదా!"

"తప్పదు కదా బాబూ. అవసరం మనది. ఇప్పుడు భోజనానికి వెళ్ళేటప్పుడు ఒకసారి కలిసి వస్తాను"

అప్పారావుని భోజనానికి పంపించి తాను మగ్గంలో కూర్చొన్నాడు. మల్లిబాబుకి నడుం పీకుతుందంటే తను నేతకి కూర్చొన్నాడు. మల్లిబాబు వాటేస్తున్నాడు గాని అలవాటు తప్పిపోయింది. సాలునాడి మీద ఒక్కొక్కసారి పడుగుపోగు ఒకటి ఎక్కువైనా ఔతుంది. తక్కువైనా ఔతుంది. ఎక్కువైతే నాడి మొన వెనక్కి జరిపి పోగు వదులుతున్నాడు. తక్కువైతే నాడి పడుగు నుండి తీసి మళ్లీ గుచ్చుతున్నాడు. దారం మెలిపెట్టలేకపోతున్నాడు. కుడిచేతివాటం. అలవాటు లేదు. నేత వేగం తగ్గిపోయింది. సావుకారి నేస్తూనే గమనిస్తున్నా మాట్లాడలేదు.

"అలవాటు తప్పిపోయింది పెదనాన్నా" అన్నాడు సిగ్గుపడుతూ.

"ఫరవాలేదు. ఒకగంటే కదా, అప్పారావు వచ్చేస్తాడు. సోమీ ఏటి చేస్తావురా?"

కొత్త సంవత్సరానికి పనిలోకి రమ్మంటాడేమో, బాబు తన ఆలోచనలను పసిగట్టేశాడా? ఏం జవాబు చెప్పాలి? తాను బయటపడకూడదు.

"మీరే చెప్పండి పెదనాన్నా"

"మగ్గం పని మానీరా!"

దొరికి పోయాననుకొన్నాడు మల్లిబాబు.

"నేతగాడికి బతుకులేదురా. ఏదో ఉద్యోగం చూసుకో. ఎనిమిదవ తరగతి పాసయ్యావు. క్రాఫ్టు పరీక్షకు కట్టు. నీకు అన్నీ వచ్చు. నీకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది"

మల్లిబాబు ఊపిరి పీల్చుకొన్నాడు.

"ఇప్పుడు నువ్వు మంచి జీతమే ఇస్తున్నావు కదా! క్రాఫ్టు మాస్టరు ఉద్యోగం చేస్తే యింతకంటే ఎక్కువ రాదు. పయూరు వెళ్లిపోవాలి"

"నీకు తెలీదుగా అబ్బి. అన్ని రోజులు ఒక్కలాగే వుండవు. మనిల్లు చూడు. ఈ విధికి ఇదే పెద్దిల్లు. ఇంగ్లీషు పెంకుతో వున్న యిల్లు ఇదొక్కటే. మా నాన్న కట్టించాడు. ఈ ఊరికంతటికీ పెద్ద బట్టల వర్తకుడు. బాగా డబ్బు గడించాడు. జరీ అంచుచీరలు నేసేవాళ్లం. మేం నేసిన బట్టలకు మంచి గిరాకీ వుండేది. బట్ట ఖరీదు కూడా ఎక్కువే. బాగా డబ్బున్నవాళ్లు మాత్రమే కొనగలిగేవాళ్లు. మా నాన్న ఎక్కువ ఖరీదిచ్చి మంచి పురి వున్న సన్నని నూలు కొనేవాడు. తొడి రాటీమీదేసే

## ఆమె బాటలో ఈమె!

*ఒక్కొక్కరికీ ఒకో రోల్ మోడల్ వుంటారు కదా! అలాగే పూనమ్ బజ్వాకి కూడా ఓ రోల్‌మోడల్ వుంది. ఆమె ఎవరో కాదు- అశిన్‌ట! గ్లామరస్ తయారైనా ఎక్కడా అసభ్యంగా అనిపించకుండా కనిపిస్తుందిట అశిన్. తను కూడా అలాగే ఇకపై అలా గ్లామరస్‌గా కనిపిస్తూనే అసభ్యతకు తావు లేకుండా నటించాలని అనుకుంటున్నాను అంటోంది పూనమ్ బజ్వా. ఆమె ఆలోచన బానే వుందిగానీ అందరూ అశిన్‌లు అయిపోలేరు కదా! ఎవరి స్టయిలు వారిది, ఎవరి గెటప్ వారిదే కదా!*

లోపు చెయ్యి జారిపోయిందంటే స్ప్రింగులాగ చుట్టుకొనేది. ముద్దయిపోయేది. ఒక్క బారదు పోగు కూడా వచ్చేది కాదు. అంతా రద్దుకింద పారేవలసిందే. ఇప్పుడు అలాటి నూలు దొరకదు. ఆ రోజుల్లో ముందుగా ఆర్డర్లు వచ్చేవి. అందరికీ నేసేవాడు కాదు. విజయనగరం మహారాణీగారి ఆర్డరు పూర్తయిన తరవాతే మిగతావి. నాకు విజయనగరం సంస్కృత పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. రాజులకొలువు మనకొద్దురా అంటే నేను మగ్గం గోతిలోనే వుండిపోయాను. మా నాన్నకి నా సాయం కావాలి. మగ్గం మీద బాగా ఆదాయం వచ్చేది. ఆ రోజులలాంటివి. రోజులు మారిపోయాయి. ఇప్పటికి ఫరవాలేదనుకో. రాను రాను వచ్చేవి గడ్డురోజులే. ఖాదీ కమిషన్లు వాళ్లు రేట్లు నిర్ణయిస్తారు. సొసైటీవాళ్లు ఆ రేట్లకే నూలు కొనాలి. నేత మజూరీలు ఇవ్వాలి. వీళ్లు బట్ట నాణ్యత చూస్తారు. పాటునూలు (సన్నఖద్దరు) తప్పించి సీమనూలు (మిల్లు నూలు) వాడడానికి వీలు లేదు. పత్తి ధర పెరిగిపోయింది. ఐనా మంచి పత్తిదొరకడం లేదు. రాట్నం మీద దారం తీస్తే కూలికిట్టదు. వడుగు వాళ్లు తగ్గిపోతున్నారు. చుట్టలు (పొగాకు) చుట్టుకోడానికి వెళ్ళిపోతున్నారు. నూలు నాణ్యత చెడిపోయింది. సీమనూలికీ మంచినూలికీ (పాటునూలు) తేడా తెలీడం లేదు. తేడా తెలీడం కోసం ఎడమపురి పెట్టమన్నారు. సగం రాట్నాలు మూలపడ్డాయి. నూలు దొరకడం లేదు. మన బట్టకి మంచి గిరాకీ ఉండేది. ఇప్పుడు అంత డబ్బు యిచ్చి కొనేవాళ్లు లేరు. వజా, జమదానీ పనులు మరి వుండవు. సాదా నేసుకోవాలి. మంచి మజూరీలు రావు. మన బట్ట ఖరీదెక్కువ. పొందూరు సన్నఖద్దరని చెప్పి సీమనూలు కల్తీ చేసి బట్టలమ్మే ప్రయివేటు వ్యాపారస్తులు తయారయారు. మిల్లునూలు చవక, వాళ్లు చవకగా బట్ట యిస్తారు. ఐనా పదిరెట్లు లాభం గడిస్తారు. మనం సొంతంగా అమ్ముకోలేం. వ్యాపారం తెలియాలి. మోసాలు చెయ్యాలి. మనం నేతగాళ్లం. మనకు యివన్నీ తెలీవు. అందుకే సొసైటీకి బట్టలు యిస్తున్నాం. ఈ సొసైటీ కూడా ఎంతోకాలం నడవదు. నువ్వు తెలివైనవాడివి. నాకు ఎంత మజూరు కిడుతుందో నువ్వు లెక్కలు వేస్తున్నావు. సొంత మగ్గం పెట్టాలనే ఆలోచన నీకు వుంది. నేను ఎప్పుడో పసిగట్టాను. ఆ ఆలోచన వదులుకో"

ఆశ్చర్యపోయాడు మల్లిబాబు. పెదనాన్న రాసిన కథలు చదివాడు. కాని పెదనాన్నని ఇంత బాగా ఎప్పుడూ అర్థం చేసుకోలేదు.

ఏకధాటిగా ఉపన్యాసం చెప్పి సావుకారు ఆలోచనలో పడ్డాడు. భార్య కండెలు చుడుతుంది. ఈసారి కొడుకు గూడా సాయం చేశాడు. సాయంత్రం బడి నుండి వచ్చి నూలుతోడాడు. వాడు పని చేస్తానన్నా తానే పనిలోకి చొరనిచ్చేవాడు కాదు. బాగా చదువుకొని ఏదో ఉద్యోగంలో స్థిరపడాలి. తన పిల్లలకి ఈ కష్టాలు దాపురించ కూడదు. వాడు బుడ్డీ దగ్గర కూర్చొని చదువుకొంటున్నాడు. 'మన రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్. మన ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి'

అప్పారావు పాట పాడుకొంటూ వచ్చాడు. రెండు దమ్ములులాగి బీడీ బయటకు విసిరేశాడు. తలుపు దగ్గరగా చేరవేసి వచ్చాడు. వాడు వాటుకి కూర్చున్న తరువాత సావుకారు భోజనానికి లేచాడు.



భోజనాలయేసరికి ఒక పలక నేత అయింది. పిల్లవాడి చేతిలో పుస్తకం వుంది. కాని వాడు అప్పుడే పడుకుండిపోయాడు.

భోజనాలు పూర్తయేసరికి పదిన్నర అయింది. ఇల్లాలు నడుంవాల్చుకొందాం అనుకొనేసరికి "అమ్మా కండెలు అయిపోయాయి. పేకనూలు తోడివుంటే నాలుగు కండెలు చుట్టు అందాకా" అన్నాడు మల్లిబాబు.

పరిటి ఖాళీగా వుంది. ఇప్పుడు నూలుతోడి కండెలు చుట్టి ఇవ్వాలి. సావుకారమ్మ నూలు తోడుతోంది.

మల్లిబాబుకి నీరసంగా వుంది. కునికిపాట్లు పడుతున్నాడు. బలవంతంగా నిద్రనాపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సావుకారు గమనించాడు. "సామీ! నువ్వెళ్ళిపోరా. నేను మగ్గంలో కూర్చొంటాను. భోం చేసి పడుకో. చీకటిని తెలివొస్తే ఒకసారి రా!" అన్నాడు.

"వస్తాను పిన్నీ!"

ఉండురా అని చెప్పి సావుకారమ్మ చిన్న గిన్నెలో వంకాయ కూర వేసుకొచ్చింది.

సావుకారు నేస్తున్నాడు. అప్పారావు వాటేస్తున్నాడు.

"నీ సంగతేటిరా అబ్బీ?"

"బాబూ నేనెక్కడికి ఎలిపోతాను? నువ్వు పొమ్మన్నా నేను పోను"

"మరి జీతం రా?"

"పెంచాలికదా బాబూ, నీకు తెలీదేటి"

"మల్లిబాబు సంగతేటిరా?"

"ఆడు పెద్ద ఆలోచనలో వున్నాడు. గొప్ప లెక్కదారుడు. నీ దగ్గిర డిజైనులు రాయడం, జాకార్డు నడపడం, అన్నీ నేర్చుకున్నాడు. సొంతమగ్గం పెట్టుకోవాలని ఆశ. బాబూ! సూరిబాబు మనదగ్గరికి రావాలని సూస్తన్నాడు. మంచి పనోడు. లింగరాజుగారి దగ్గిర ఎన్నాళ్లు పనిచేసినా జీతం పెంచడు. రాత్తిరి పదిన్నర వరకు పని చేయించుకుంటాడు. పనోడు బాగుపడితే అతను సూడలేడు"

గోడ గడియారం పన్నెండు కొట్టింది. సూరిబాబు తలుపుతోసుకొని లోపలికొచ్చాడు. దుప్పటి తీసి రాయబారంకర్ర (పడుగు చుట్టని వ్రేలాడదీయడానికి ఉపయోగించే వెదురుబొంగు) మీద వేశాడు. తలుపు మూసొచ్చాడు. అప్పారావు లేచాడు. వాడిస్థానంలో

## మంచి పాలసీయే!

ఛార్మి వుందంటే- ఇక సినిమాలో కుర్రకారుకి హుషారెక్కించేలా అందాల ఆరబోత వుంటుందని ఇటీవల ఆమె నటించిన సినిమాలు చూస్తే ఎవరైనా చెబుతారు. చిన్నా పెద్ద నిర్మాతలు అని తేడా లేకుండా తగిన పారితోషికం ఇవ్వాలేగానీ ఆ సీన్‌కి కావాల్సినంత 'అందాన్ని' అందించడానికి రెడీ అవుతుంది. 'కోట్లు పెట్టి సినిమాలు తీసే నిర్మాతలకి కాస్త లాభాలు రావాలన్నా, టిక్కెట్టు కొని మరీ చూసే ప్రేక్షకుడికి కొంచెం కనువిందు కావాలన్నా అందాలను ఆరబోయడంలో తప్పేమీ లేదు' అనేది ఛార్మి పాలసీట.

సూరిబాబు వాటుకి కూర్చొన్నాడు. సూరిబాబుకి నేతనెయ్యడం వచ్చు. ఐనా వాటుకి కూర్చొన్నాడు. సావుకారి పక్కన కూర్చోవడం ఇదే మొదటిసారి. సావుకారు నేసే పద్ధతిని గమనిస్తున్నాడు. పలక లాగడం, దెబ్బ వెయ్యడంలోని ఒడుపు చూస్తున్నాడు.

అప్పారావు సావుకారమ్మకి టీ పెట్టమని చెప్పి, తాను తోడదం ప్రారంభించాడు. సావుకారమ్మ బొగ్గుల పొయ్యి ముట్టించింది. విసనగర్రతో విసరి రాజేసింది. బొగ్గులన్నీ అంటుకొన్న తరువాత సిలవరి తపేలాతో ఇద్దరికీ టీ పెట్టింది. అప్పారావు బీడీ వెలిగించి కండెలు పడుతున్నాడు. టీ మరిగేసరికి కండెలు పట్టడం అయిపోయింది. ఇద్దరు పనివాళ్లూ టీలు తాగి పనిలో కూర్చొన్నారు. సావుకారమ్మ వంటింటిలోని దీపం ఆరిపేసి పడకేసింది.

సూరిబాబు నేస్తున్నాడు. సావుకారు చుట్టకాలుస్తూ పడక కుర్చీలో పడుకొన్నాడు. పలకలాగిన శబ్దం వింటున్నాడు. బాగానే నేస్తున్నాడు. నేత తరచూకాదు, తెలితీ కాదు. సొసైటీవాళ్లు బూతద్దం పెట్టి చూస్తారు. అంగుళంలో ఎన్ని పోగులున్నాయో లెక్కపెడతారు. లెక్కకు ఎక్కువైనా, తక్కువైనా మజూరీ కొట్టేస్తారు. ఫరవాలేదు జాగ్రత్త అయిన వాడే. కొత్త సంవత్సరానికి సూరిబాబుని పనిలో పెట్టుకోవచ్చు అనుకున్నాడు సావుకారు.

"బావా శ్రీగాకుళంలో మాయాబజారు ఆడతంది అంజనేయాలో. మురళీలో సువర్ణ సుందరి. రెండూ గొప్ప సినిమాలనుకో. సువర్ణసుందరిలో పాటలున్నాయిరా! మధురం, మధురాతి మధురం.

పిలువకురా, అలుగకురా

నలుగురిలోనను ఓ రాజా...ఆ..

"కనుమునాడెలిపోయి రెండాటలు సూసిద్దాం"

సరే అన్నాడు సూరిబాబు.

"ఇంతకీ మనూరి సినీమా, జయసింహ, సూశావా లేదా?"

"లేదురా, రేపెల్లాలి"


అప్పారావు జయసింహ కథచెప్తూ, మధ్య మధ్య పాటలు పాడుతున్నాడు. నేత జోరుగా సాగుతుంది. ఈ లెక్కన నేస్తే నాలుగో గంటకి నేత పూర్తయిపోతుంది. నమ్మకంగా వాలుకుర్చీలోనే నిద్రపోయాడు సావుకారు.

పలక శబ్దం వినిపించడం లేదు. నేత ఆగిపోయింది. పనివాళ్లు గుసగుసలాడుకొంటున్నారు. సావుకారికి తెలివి వచ్చింది. బాబుకి ఈ విషయం ఎలా చెప్పాలా అని ఇద్దరూ చర్చించుకొంటున్నారు. సావుకారు లేచాడు.

"బాబూ! నిద్దరొస్తుంది గదా అని బీడీ ముట్టించాను. నేస్తన్నాం. ఎప్పుడు పడిపోయింది నిప్పురవ్వ" అంటుండగానే సావుకారు చీర చూశాడు. చీర మీద చిటికిన వేలంత రంధ్రం.

సావుకారు కోపంతో ఊగిపోతున్నాడు. "కొంప ముంచీసావు గదరా! గాడిద కొడకా!" అంటూ కోపం తట్టుకోలేక పక్కనే వున్న గజం బద్ధతో అప్పారావు వీపు మీద ఒక్కటి వేశాడు. అప్పారావు అమ్మా అని అరిచాడు.

అబ్బాయి తుళ్లుబడి లేచాడు. తండ్రి చేతిలో గజం బద్ద వుంది. పిల్లవాడు ఒక మూలకు చేరి నిద్ర నటిస్తున్నాడు. ఇల్లాలు బిత్తరిచూపులుచూస్తుంది. మొగుడు కోపిష్టి. ఆవేశపరుడు. మామూలుగా ఐతే నోటంట 'అమ్మా, ఆలీ' అంటూ తిట్ల ప్రవాహం దొర్లాలి. కానీ అతని నోరు మూసుకుపోయింది. మరొక్క మాట రాలేదు. ఎప్పుడూ లేనిది భర్త కళ్లల్లో నీళ్లు తిరగడం ఇల్లాలు చూసింది. కలత చెందింది. ఏం ముంచుకొస్తుందో, రేపెలాగ గడుస్తుందో, తానేం చెయ్యగలదు. పండుగనాడు పనివాళ్లందరికీ భోజనాలకి పిలవాలి. మొగుడూ, పనివాళ్లూ, పిల్లలూ, అందరూ కలిసి భోంచేస్తారు. బూరెలూ, పులిహోరా చెయ్యాలి. అప్పారావు తల్లి సాయానికి వస్తుంది. కాని అప్పారావు ఒంటిమీద దెబ్బ పడిపోయింది. గండం గట్టెక్కించుమని పెద్దలకి మొక్కుకొంది ఇల్లాలు. అప్పారావు వైపు చూసింది. సావుకారమ్మ కళ్లల్లో నీళ్లు. అప్పారావు కళ్లల్లో నీళ్లు. ఇల్లాలు చీర కొంగు నోటిలో కుక్కుకొని గోడవైపు తిరిగింది.



దూరంగా వరిచేను కోసిన పొలాల్లో చలికి నక్కలు ఊలలేస్తున్నాయి. పిల్లవాడు ముసుగేసుకొన్నాడు గానీ, ఒణికిపోతున్నాడు. చలికి కాదు. భయంవల్ల. భయంకరమైన ఆలోచనల వల్ల. పద్దెనిమిదవ తేదీలోపు స్కూలు ఫీజు కట్టాలి. ఆ తేదీ దాటితే ఫైనుతో కట్టాలి. నెలాఖరులోపు కట్టకపోతే పేరు తీసేస్తారు. క్లాసులోకి రానివ్వరు. హాజరు తగ్గిపోతుంది. మళ్లీ ఫైను. ఎడ్మిషను ఫీజుతో కలిపి కట్టాలి. లేకపోతే చదువు మానుకోవాలి. మగ్గం పనిలో కుదిరిపోవాలి.

సూరిబాబు భయం భయంగా చూస్తున్నాడు. "ఇటువంటి కోపిష్టి దగ్గరా పని చేయాలనుకొంటున్నాను" అనుకొన్నాడు.

"ఇప్పుడేటి సెయ్యాలి? తెల్లారేసరికి నేత దిగిపోవాలి. సావుకారిచ్చిన డబ్బులో సగం ఇంటి ఖర్చులకిచ్చీసి పేకాటకెలిపోవాలి. కనుంనాడు శ్రీగాకుళం ఎల్లి సిని

## దీపిక డప్పు

దీపికా పదుకొనె తొలిచిత్రం 'ఓం శాంతి ఓం'లో ద్విపాత్రాభినయం చేసింది. రాబోయే ఆమె చిత్రం 'చాందినీ చౌక్ టు చైనా టౌన్' అనే సినిమాలోనూ ద్విపాత్రాభినయం చేస్తోంది. ఇండియన్ గాళ్‌గా, చైనా గాళ్‌గానూ నటిస్తోంది. చైనా అమ్మాయి పాత్రకి కావలసిన మార్షల్ ఆర్ట్స్‌ని బాగా నేర్చుకుని మరీ నటించిందిట దీపిక. ఈ సంగతి ఆమె చెబుతూ- తను ఎంతగా కష్టపడిందీ సినిమా చూసిన వాళ్లకి ఇట్టే తెలిసిపోతుంది' అని తెగ గొప్పలు చెప్పుకుంటోంది దీపిక.

మాలు నూసియ్యాలి. పేకాటలో గెలిసిన డబ్బుతో ఒక జత బట్టలు కుట్టించుకోవాలి. ఆటలో గెలుస్తాం అని గ్యారంటీ లేదు. కాబట్టి బావ దగ్గర సగం డబ్బులు దాసుకోవాలి" అప్పారావు పౌరుషవంతుడు. ఐనా దుఃఖించలేదు. బాబు మనస్సు వాడికి తెలుసు. వాడి మనస్సు గాయపడలేదు. బాబు కడుపుమీద కొట్టడు.

"రేపు పనివాళ్లకు కూలి డబ్బులు ఎక్కడ నుండి తేవాలి. రేపు ఇంటి చాకలి వస్తుంది. దానికి అర్ధ సంవత్సరం జీతం ఇవ్వాలి. టైలరికి, బట్టలకొట్టుకి, కిరాణా కొట్టుకి, అందరికీ రేపటికి వాయిదా వేశాడు. ఇంట్లో పండుగ ఎలా జరుపుకోవాలి. నెలరోజుల భత్యం, నోటి ముందున్న కూడు లాగేసినట్లయిపోయింది. 'సావుకారు చుట్టముట్టించుకొని వీధిలోకి వెళ్లాడు గుప్పుమని పొగ వదిలాడు. పనివాళ్లు, చాకలి, మంగలి, టైలరు, భార్య, పిల్లవాడు అందరూ తనచుట్టూ తిరుగుతున్నారు. తాని ప్పుడు వాచీలోని మెయిన్ స్ప్రింగు. మెయిన్ స్ప్రింగులో శక్తివుంటేనే చక్రాలన్నీ తిరుగుతాయి. ఆ శక్తి డబ్బు. 'లేనివాడు పుడమి లేనివాడు. లేనినాడు కలుగు ప్రభువు కైనను కీడు' చుట్ట విసిరేసి ఇంట్లోకి వచ్చి తలుపు దగ్గరగా మూశాడు. ఇలాగ తీసుకెళ్తే సొసైటీవాళ్లు చీర తీసుకోరు. చేతికి డబ్బులు రావు. ఏం చెయ్యాలి. మళ్లీ ఒకసారి నేతని చూశాడు.

"ఇంకా ఎంతనేత వుందిరా?" అని అడిగాడు.

అప్పారావు లచ్చ (పొడవును తెలిపే గుర్తు) ఎక్కడుందో చూశాడు. "లచ్చ అచ్చులకాదుంది. ఇంకా అడుగు నేస్తే చీరదిగిపోద్ది బాబూ" అన్నాడు భయం భయంగా.

రంధ్రం తరువాత జానడు నేత నేసి వుంది.

"కోసీయండి రా"


ఆలోచనకి సమయం లేదు. జానడు జానడు దూరం నిలువుగా రంధ్రం వున్నంత వరకు నేసిననేత చెరో బ్లేడు పట్టుకొని కోసేశారు. సావుకారు ఇద్దరిమధ్య కూర్చొన్నాడు. అచ్చుతొక్కుతూ ఒక్కొక్క పేకపోగు సూదితో తీసేస్తున్నారు. ముగ్గురూ కలిసి పేకదారాన్ని పది నిమిషాలలో తీసేశారు. రద్దుపోగులన్నీ దగ్గరకు చేర్చారు. సూరిబాబు ఉండ చుట్టాడు. షావుకారు చేతిలోకి తీసుకొని బరువు అంచనా వేశాడు. సుమారు ఐదు తులాలు వుంటుంది. సొసైటీ మేనేజరు చాలా గట్టివాడు. లెక్కప్రకారం తరుగు నిర్ణయిస్తాడు. ఈ అధికారానికి ఒప్పుకొంటాడో ఒప్పుకోడో. ఒప్పుకోకపోతే డబ్బు కట్టీవలసి వుంటుంది. మజూరిలోనే విరుపుకొంటాడు.

మళ్లీ నేయడం ప్రారంభించారు. చలి, టీ తాగితే గాని హుషారు రాదు. షావుకారమ్మ వైపు చూస్తూ "అమ్మా! కొంచి టీ నీళ్లు" అన్నాడు అప్పారావు.

"పాలు లేవురా. నాలుగు గంటలవుతుంది. ఇప్పుడుపాలెక్కడ దొరుకుతాయి?"

"అమ్మ గలాసివ్వండి" అంటూ మొగ్గం నుండి లేచాడు అప్పారావు. సావుకారు వాటుకి కూర్చొన్నాడు. పావలా డబ్బులు, గలాసు తీసుకొని అప్పారావు వెళ్లాడు.

కర్రలపొయ్యి ముట్టించింది సావుకారమ్మ. వీళ్లకు టీ ఇచ్చేసి తను వేడి నీళ్లు పెట్టుకో వచ్చు స్నానానికి అనుకొంటూ



పొయ్యి దగ్గర కూర్చొని చలి కాచుకొంటూ కర్రలెగదోస్తుంది. పది నిముషాల తరువాత పాలగ్లాసు, పావలా కాసు సావుకారమ్మ చేతిలో పెట్టాడు అప్పారావు.

"పాలెక్కడివిరా?"

"సుబ్బయ్య ఆవుపాలు పితుక్కొచ్చాను. వీధి చివర సుబ్బయ్య పశువుల సాల వుంది కదా"

"తెలిస్తే తిడతాడు"

"తెలీదు. కుంచెడు పాలిచ్చే ఆవు"

అప్పారావే అందరికీ టీలు కలిపి ఇచ్చాడు. నేత జోరుగా సాగుతుంది. టయిము ఐదు కావస్తోంది. వీధిలో జన సంచారం ప్రారంభం అయింది.

"నువ్వు లేచిపోరా, నేను మగ్గంలో కూర్చొంటాను" అన్నాడు సావుకారు. సావుకారు కళ్లల్లోకి చూశాడు సూరిబాబు. ఆ కళ్లల్లో మెరుపు. సావుకారు నేస్తున్నాడు. ప్రక్కన అప్పారావు చకచకా వాటేస్తున్నాడు. ఒకరి దగ్గర పనిచేస్తున్నవాడు, ఇంకొకరి దగ్గరకు వెళ్లకూడదు. తన దగ్గర పనిచేసినట్లు తెలిస్తే లింగరాజు గొడవ పెడతాడు. భోగినాడు సంవత్సరం కూలి లెక్క వేసి వాడకం పోగా ఇవ్వవలసినది ఇచ్చేయాలి. లింగరాజు డబ్బులివ్వడానికి ఒప్పుకోడు. లేదా ఈరోజు కూలీ డబ్బులు ఇరిపేస్తాడు.

"ఇదిగో పెరట్లోనుంచి వెళిపో. ఎవరికంటా పడకు. భోగీ మంట దగ్గరకు వెళిపో. ఎవరూ అనుమానించరు. మధ్యాహ్నం కనిపించు"

సూరిబాబు చీకట్లోకి జారుకొన్నాడు. నేత జోరుగా సాగుతోంది.

*జయ జయ శ్రీరామా*
*రఘువరా! శుభకర శ్రీరామా*

జయసింహలోని పాట అందుకున్నాడు అప్పారావు. తూర్పు తెలతెలవారుతుండగా నేత దిగిపోయింది. కచ్చిపట్టి సివ్వలు తొడిగారు. చాపు కోసేశారు. రెండు చీరలు మడత పెట్టారు. అబ్బాయి భోగిపిడకల దండ పట్టుకొని వీధిలోకి పరుగు పరుగున వెళ్తున్నాడు. వాడి స్నేహితులు బయట నిలబడ్డారు వీడికోసం. ఇల్లాలు కొత్త చీర కట్టుకొని తులసి కోటకు ప్రదక్షిణ చేస్తూ మనస్సులోనే ఏదో చదువుకుంటోంది. తాను చుట్టముట్టించుకొని వీధిలోకొచ్చేసరికి తూర్పు దిశలో బంగారు రంగులో వెలుగురేకలు.

☆

## తెలుగంటే ఇష్టం

*జార్ఖండ్ సుందరి తనుశ్రీ దత్తా- తను గొప్ప ఏకసంథాగ్రాహినంటుంది. ఎలాగంటారా? తనకి ఇప్పటి దాకా ఆరు భాషలు మాట్లాడడం వచ్చుట. వాటిలో తెలుగు కూడా వుంది. బాలకృష్ణతో 'వీరభద్ర' సినిమాలో కలిసి నటించినప్పుడు తను తెలుగు నేర్చుకుందిట. అవకాశం వస్తే బాలకృష్ణతో మళ్లీ మళ్లీ నటించాలని వుంది అని తెగ సిగ్గు పడుతోంది. హైదరాబాదన్నా, హైదరాబాదీ బిర్యానీ అన్నా తనకి బోల్డు ఇష్టం అని చెప్పే తనుశ్రీకి మరి టాలీవుడ్‌లో చాన్సులు వచ్చేదెప్పుడో?*